క్లుప్తంగా

నేడు డివిజన్ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి సంబంధిత ప్రతినిధులంతా హాజరు కావాలని సూచించారు.

రేపటి నుంచి విద్యుత్ శాఖ ప్రజాభిప్రాయ సేకరణ

టెక్కలి: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల (టారీఫ్)పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు టెక్కలి డివిజన్ విద్యుత్ శాఖాధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు స్థానిక డివిజన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్న ఒంటి గంట వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టాలి

టెక్కలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రజలే తిప్పికొట్టాలని మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. ప్రతి కుటుంబానికి అవసరమైన సంక్షేమ పథకాలను అందజేస్తున్న తరుణంలో ఆయా పథకాలపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెట్టే విధంగా ప్రతిపక్షాలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. గతంలో ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా దాచిన నిధులను అప్పటి టీడీపీ నాయకులు ఏం చేశారోనని ప్రజలంతా ప్రశ్నించాలని కోరారు.

21 నుంచి మందసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మందస: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 21 నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నిర్వహిస్తారని ఎంపీపీ డొక్కరి దానయ్య మంగళవారం తెలిపారు. 21న సరియాపల్లిలో పల్లెనిద్రతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం, 27న కొత్తపల్లి, 30న జిల్లుండ పంచాయతీ పరిధిలో ఉదయం పది నుంచి కార్యక్రమాన్ని చేపడతారన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

19న మున్సిపాలిటీ పరిధి 25వ వార్డులో..

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 25వ వార్డులో ఈ నెల 19వ తేదీన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నిర్వహించనున్నారు. ఈ మేరకు పలాసలోని మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

నేడు కవిటి–2 సచివాలయం పరిధిలో ...

కవిటి: కవిటి–2 సచివాలయం పరిధి 8, 9, 10, 13 వార్డుల పరిధిలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం బల్లిపుట్టుగలోని సాయిరాజ్ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు, అధికారులు పాల్గొనాలని సూచించారు.

క్రికెట్, వాలీబాల్ కిట్లు వితరణ



కిట్లు అందజేస్తున్న సీతన్న

నరసన్నపేట: మండలంలోని బాలసీమలో యువకుల కోరిక మేరకు క్రికెట్, వాలీబాల్ కిట్లను గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు, మన్యం జిల్లా వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షులు మల్ల సీతన్న వితరణ చేశారు. మంగళవారం యువతకు ఈ కిట్లను అందించారు. యువకులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పేద కుటుంబాలకు చెందిన ముగ్గురు మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు.

రామకృష్ణాపురంలో వాలీబాల్ పోటీలు



విజేతలకు బహుమతి అందజేస్తున్న సర్పంచ్ బాబూరావు

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ పంచాయతీ పురుషోత్తకర్ర గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో రామకృష్ణాపురం జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్ పోటీలో సారవకోటపై రామకృష్ణాపురం జట్టు విజయం సాధించింది. సర్పంచ్ కొండాల బాబూరావు, ఉప సర్పంచ్ చింతపల్లి భాస్కరరావు బహుమతులు అందజేశారు.

● ఏరువాక కదిలింది



రబీ కాలంలో రైతులు సాగు చేసే పంటల్లో వేరుశనగ ఒకటి. ఈ పంట సాగు ప్రక్రియలో భాగంగా విత్తనాలు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. నీటి వనరులు అనుకూలంగా ఉన్నచోట వేరుశనగను పండించే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. పలాస మండలం గిరిజన గ్రామాలైన పెదగంతారు, చినగంతారు గ్రామాల్లో విత్తనాలు వేస్తున్న దృశ్యమే ఇది. -కాశీబుగ్గ

● రెండు దశాబ్దాల తరువాత..



పోలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2002లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తరువాత మంగళవారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం వివిధ ప్రాంతాల్లో ఉన్నవారంతా సంక్రాంతి నేపథ్యంలో సొంత గ్రామాలకు వచ్చారు. వీరంతా చదువుకున్న పాఠశాల ఆవరణలోనే కలుసుకొని ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. -టెక్కలి రూరల్

● వస్త్రదానం



పలాస మండలం చినంచల పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాలకు చెందిన పలువురికి ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు మంగళవారం వస్త్రదానం చేసి ఉదారతను చాటుకున్నారు. నిరుపేదలు, ఒంటరి మహిళలు, వృద్ధులకు చీరలు, పంచెల షాపులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పెద్దలు, యువకులు పాల్గొన్నారు. -కాశీబుగ్గ

ఇండియన్ ఆర్మీ వైద్యుడికి సన్మానం



తేజేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం



పలాస: తులసయ్యకు సత్కరిస్తున్న గ్రామస్తులు

మందస: ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన పందిరి తేజేశ్వరరావు ఇండియన్ ఆర్మీ వైద్యుడిగా ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన పరీక్షలో 225వ ర్యాంకు సాధించిన ఈయనను ఉత్తరప్రదేశ్‌లోని లక్నో ఆర్మీ ఆస్పత్రిలో వైద్యుడిగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఇతని తల్లిదండ్రులు వాసుదేవరావు, ఈశ్వరి దంపతులు సామాన్య కుటుంబానికి చెందినవారు. ఉత్తమ ప్రతిభ చూపిన తేజేశ్వరరావును మంగళవారం మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, బహడపల్లి సర్పంచ్ బొడ్డు శాంతిప్రియతో పాటు పలువురు సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సరియాపల్లి సర్పంచ్ బత్తిని వెంకటరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మామిడి కృష్ణారావు, ఏఎంసీ డైరెక్టర్ మట్ట కూర్మారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డు ఉదయ్, దున్న బుజి, కొర్నాన లోకనాథం, సాలీన రోజా, పాపారావు పాల్గొన్నారు.

జానపద కళాకారుడికి..

పలాస: రంగోయి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు గేదెల తులసయ్యకు సంక్రాంతి సందర్భంగా తన ఆటా పాటలతో అలరించినందుకు మాకన్నపల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో మూడు రోజులు ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తులసయ్య 40 నిమిషాల పాటు తన గొంతుతో చక్కని పాటలు పాడి స్థానికుల అభిమానాన్ని పొందారు. కార్యక్రమంలో ప్రజాగాయకుడు కుత్తుం వినోద్, సర్పంచ్ సైని దేశయ్య, కుత్తుం ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

యాదవులను ప్రోత్సహించాలి



మెడిసిన్ సీట్లు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: యాదవ సామాజిక వర్గానికి సరైన రిజర్వేషన్ వర్తింపజేయడంతోపాటు వారిని ప్రోత్సహించాలని జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం పెద్దలు కోరారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పురుషోత్తపురం గ్రామంలో సంఘ అధ్యక్షుడు డొక్కరి ధనుంజయ ఆధ్వర్యంలో యాదవ విద్యా నవచైతన్య సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ–సీలో ఉన్నటువంటి తమ సామాజికవర్గానికి తగినంత ప్రోత్సాహం లభించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో తమను మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ (ఎంబీసీ)లో లేదా బీసీ–ఏలో అయినా చేర్చాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామన్నారు. యాదవుల జీవన శైలిని పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మెడిసిన్ సీట్లు సాధించిన తొమ్మిది మందితోపాటు ఐఐటీ, పీహెచ్‌డీ విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు లొడగల కామేశ్వరరావు, కొరికాన శంకరరావు, సప్ప నవీన్, డొక్కరి శంకరరావు, కర్రి మాధవరావు, బర్రి గోపాలరావు, దాసరి తాతారావు, అంబటి క్రిష్ణమూర్తి, వంకల కూర్మారావు, నర్సు వెంకటరమణ, జనార్దన్‌రావు, భాస్కరరావు, సోమేశ్వరరావు, ఉమాపతి పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నాయకులకు నివాళులు



మార్పు స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మందస: కమ్యూనిస్టు నాయకులు..సర్దార్ మార్పు పద్మనాభం, సీతారామయ్యలు సమాజంలో మార్పు కోసం నిరంతరం తపించారని బిన్నళమదనాపురం సర్పంచ్ మార్పు భవానీ, పలువురు నాయకులు అన్నారు. పద్మనాభం, సీతారామయ్య స్థూపాల వద్ద మంగళవారం నివాళులర్పించారు. బిన్నళకు చెందిన వీరిద్దరూ తండ్రి, కొడుకులుగా ప్రజా పోరాటాలకే తమ జీవితాలను అర్పించారన్నారు. పద్మనాభం బ్రిటిష్ పాలకులపై పోరాటం సాగించారని, రైతాంగ ఉద్యమాల్లో పాల్గొని అందరికీ ఆదర్శమయ్యారన్నారు. సాగునీటి వనరులకై ఆమరణ నిరాహారదీక్ష చేసిన సీతారామయ్య కడవరకు ప్రజా సమస్యలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. మార్పు కోసం తపించిన వీరిద్దరూ నేటితరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్పు కృష్ణమూర్తి, మాజీ మావోయిస్ట్ మార్పు వెంకటరమణ, మార్పు ధర్మారావు, అనంతరావు, డిక్కల చిట్టిబాబు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు జమ

కొత్తూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు వారి ఖాతాల్లోకి ప్రభుత్వం నేరుగా జమ చేసిందని ఏఓ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 16 తేదీన రైతుల ఖాతాల్లోకి రెండో విడత ధాన్యం డబ్బులు జమ అయ్యాయన్నారు. మండలంలో ఇంతవరకు 15,887 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 3,380 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇంతవరకు 80 శాతం మంది రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. మిగిలిన రైతులకు కొద్ది రోజుల్లోనే డబ్బులు జమ అవుతాయన్నారు. మండలంలో కొత్తూరు, ఓండ్రుజోల, కర్లెమ్మతోపాటు పలు రైతు భరోసా కేంద్రాలకు ఇచ్చిన ధాన్యం లక్ష్యాలను పూర్తి అయినట్లు చెప్పారు. ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలో ధాన్యం మిగిలి ఉన్నట్లు అయితే ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే రైతులకు షెడ్యూల్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మండలంలో సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉన్నట్లు అంచనా వేశామన్నారు. రైతులు ఆందోళన చెందొవద్దన్నారు.

● సినీ నటుడు గిరీష్ సందడి



నటుడు గిరీష్‌ను కలుసుకున్న యాత్రీకులు

సరుబుజ్జిలి: పలు చలన చిత్రాలతోపాటు, బుల్లితెర సీరియల్స్‌లో నటించిన కింతలి గిరీష్ తన స్వంత గ్రామం పురుషోత్తపురంలో సందడి చేశారు. గ్రామంలో జరుగుతున్న జాతరకు ఆయన విచ్చేశారు. మహిళలు, యువత ఆయనతో సెల్ఫీల కోసం పోటీపడ్డారు. ఎక్కడ ఉన్నా ప్రతిఏటా సంక్రాంతికి స్వంత ఊరు తప్పకకుండా వస్తానని, గ్రామాభివృద్ధిలో తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. రెగ్యుల్ సీరియల్స్‌తోపాటు, ఇటీవల విడుదలైన ధమాకా, హిట్–2 చిత్రాల్లో మంచి పాత్రలు చేసానన్నారు. అనంతరం ఉమాకామేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



వలంటీరుకు నియామక పత్రం అందజేస్తున్న నిమ్మన దాస్

సోంపేట: గ్రామ వలంటీర్లు సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. జింకిభద్ర తదితర గ్రామాలకు నూతనంగా ఎంపికైన పలువురు వలంటీర్లకు నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూసి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జింకిభద్ర ఉప సర్పంచ్ సాహుకారి జానీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంత్ ఉన్నారు.

పోలీసు ఉద్యోగాల పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

● డీఎస్పీ శ్రీనివాసరావు



కోటబొమ్మాళి: ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న పోలీసు ఉద్యోగాల పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని టెక్కలి ఇన్‌చార్జి డీఎస్పీ జి.శ్రీనివాసరావు తెలిపారు. కోటబొమ్మాళిలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాలను టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళితో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పరీక్షలు నిర్వహిస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాలుగా కేటాయించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, వంశధార, విక్టరీ కళాశాలల్లో ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ స్థానిక ఎస్సై షేక్‌ఖాదర్‌బాషాకు పలు సూచనలు చేశారు.

వరి కుప్పలను ధ్వంసం చేస్తున్న పందులు

టెక్కలి: గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులు తమ వరి కుప్పలను ధ్వంసం చేస్తున్నాయని గోపినాథపురం ప్రాంతానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వరి కుప్పలు వేశామని.. సంక్రాంతి పండుగ అనంతరం నూర్పులు చేయాలని భావించగా ఇంతలోనే పందులు చొరబడి ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి పందుల నుంచి విముక్తి కలిగించాలని రైతులు కోరుతున్నారు.

సమాజ చైతన్యానికి కృషి చేయాలి



పేదలకు దుస్తులు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

టెక్కలి: ప్రజా, సామాజిక సంఘాలన్నీ సమాజ చైతన్యానికి కృషి చేయాలని మండల విశ్రాంత ఇంజినీరింగ్ అధికారి పి.సింహాచలం కోరారు. పట్టణంలోని పట్టుశాలి సంక్షేమ సంఘం ఆరాధ్య దైవం భావనా ఋషి జయంతి కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజ శ్రేయస్సు కోసం తమవంతు సాయం చేయాలని కోరారు. కులాల ఆది గురువులను కొలిచే క్రమంలో త్రికరణ శుద్ధి అవసరమన్నారు. అలాగే నేటి తరం పురాతన కట్టుబాట్లు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం భావనా ఋషి చిత్రపటానికి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దుంపా లోకేశం, ఎం.మధుసూదనరావు, మాదుగుల రామారావు, దుంప మురళీమోహన్, ఆట్ల రవి, డి.సుధా, ఆట్ల వెంకటేశ్వరరావు, పేకల వెంకటరమణ, ఎం.పార్వతీశం, బుడ్డ నందికేశ్వరరావు, కె.అచ్యుత్‌రావు, వి.అశోక్, డి.సాంబమూర్తి, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



కీడాకారులను అభినందిస్తున్న కోచ్ దుర్గాప్రసాద్ తదితరులు

ఇచ్ఛాపురం: గుంటూరులో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన స్కూల్ ఆఫ్ తైక్వాండో క్రీడాకారులు 11 పతకాలతో ప్రతిభ చాటారు. దీంతో స్థానిక వైఎస్సార్ కల్యాణ మండపం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో క్రీడాకారులను అభినందించారు. దమయంతి, గిరిరెడ్డి, పి.చైతన్య, ఎ.రేవంత్, ఎస్.జయరామ్, పి.ధరణిరెడ్డిలు బంగారు, వినయ్‌కుమార్ రజిత, అకాష్‌రెడ్డి, చందు, అఖిల్, హిమలు కాంస్య పతకాలు సాధించారు. వీరిలో బంగారు పతకాలు సాధించిన వారు తమిళనాడులో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు కోచ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, కాళ్లదిలీప్, మాజీ సైనిక ఉద్యోగి ఎల్‌సీరావు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేత బల్లపుట్టుగ



బల్లపుట్టుగ క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పెద్దశ్రీరాంపురం గ్రామంలో రెండు రోజులపాటు నిర్వహించిన వాలీబాల్ పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. విజేతగా బల్లపుట్టుగ జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో బెజ్జిపుట్టుగ, తృతీయ స్థానాన్ని పెద్దశ్రీరాంపురం జట్లు దక్కించుకున్నాయి. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా సుధీర్ (బల్లపుట్టుగ), బెస్ట్ సెట్టర్‌గా శాంతి (పెద్దశ్రీరాంపురం), బెస్ట్ హిట్టర్‌గా శేషగిరి (బెజ్జిపుట్టుగ) ఎంపికయ్యారు. విజేతలకు మండల పరిషత్ అధ్యక్షుడు పైల దేవదాస్‌రెడ్డి, స్థానిక ఎస్సై ఎస్.చిరంజీవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి క్రిష్ణారావు, సర్పంచ్ బల్లెడ సుమన్‌ల చేతులమీదుగా బహుమతి ప్రదానం చేశారు.

జన జాతర

నరసన్నపేట: హాలాహలేశ్వరిని యాత్రకు తరలివచ్చిన జనసందోహం



- ● అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ● హాలాహలేశ్వరుడికి, ముఖలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

నరసన్నపేట: మండలంలోని రెడ్డికిపేట–అంప్లాం గ్రామాల మధ్య ఉన్న మల్లికార్జునస్వామి ఆలయ (శివాలయం) ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన యాత్రకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జాతీయ రహదారి నుంచి గొట్టిపల్లి, రెడ్డికిపేట మీదుగా బసివలస రోడ్డు భక్తులతో నిండింది. ముక్కోనుమ రోజున ఏటా హాలాహలేశ్వరిని పేరున యాత్ర వందేళ్లకు పైగా ఈ శివాలయం వద్ద నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఈ ఏడాది కూడా యాత్ర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు ఎంటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని గొట్టిపల్లి, దూకులపాడు సర్పంచ్ అవ్వ రవీంద్రరెడ్డి, అల్లు అసిరినాయుడు, కమిటీ ప్రతినిధులు శిమ్మ లక్ష్మణరావు, కోరెడ్డి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కంబకాయలో..

కంబకాయలో కూడా స్వయంబేశ్వర ఆలయం 73వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ కూడలిలో యాత్ర నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో యాత్రలో పాల్గొన్నారు. యాత్రల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నరసన్నపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. యాత్ర ప్రశాంతంగా జరిగిందని సర్పంచ్ పాగోటి కుసుమ కుమారి తెలిపారు. అలాగే మండల పరిధిలోని చెన్నాపురం వద్ద కూడా యాత్ర నిర్వహించారు.

ఘనంగా ముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: ముక్కనమ సందర్భంగా రాణలో వెలిసిన ముఖలింగేశ్వరుడి తిరువీధి ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామానికి పశ్చిమవైపు ఉన్న ఆలయం నుంచి పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను జాతర స్థలం వద్దకు మధ్యాహ్నం మూడు గంటలకు తెచ్చారు. నంది వాహనంపై పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను చక్కగా అలంకరించి తిరువీధి ప్రారంభించారు. స్వామివారికి తర్ర కుటంబీకులు, భక్తులు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, చుటు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా ఉమాకామేశ్వరస్వామి రథయాత్ర

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలోని ఉమాకామేశ్వర స్వామివారి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను రథంపై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం ఆవరణలో జాతర నిర్వహించారు.

సంగమయ్య జాతర..

ఆమదాలవలస రూరల్: మండలంలో గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద ముక్కనుమ రోజు మంగళవారం జాతర నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ప్రతీ ఏడాది సంక్రాంతి పురస్కరించుకుని మూడు రోజులపాటు నిర్వహించే ఈ జాతర ముక్కనుమ రోజుతో ముగియడంతో జిల్లా, ఇతర ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. కొండపై ఉన్న సంగమయ్యకు పూజలు నిర్వహించారు. కొండ దిగువ ప్రాంతంలో జాతర ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌లో చిన్నారులు సందడి చేశారు. ఈ జాతరలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఎస్‌ఐ వై.కృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

దంతపురిక్షేత్రంలో..

సరుబుజ్జిలి: చినపాలెం సమీపంలోని దంతపురిక్షేత్రంలో గల సోమాలమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, పెద్దపాలెం సర్పంచ్ సర్థరి గురవులు నాయుడు, పార్టీ నాయకులు కిల్లి రామ్మోహనరావు, కిల్లి వెంకటేష్ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మెండ సూర్యారావు పర్యవేక్షించారు.



నరసన్నపేట: చెన్నాపురం యాత్రలో పాల్గొన్న భక్తులు



జలుమూరు: రాణా జాతరకు విచ్చేసిన భక్తులు